ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 159 | పేజీలు: 6 | వెల: రూ.3/- | గురువారం 17 సెప్టెంబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# సెమీకండక్టర్ రంగానికి రెడ్ కార్పెట్

సింగపూర్ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ

తెలంగాణలో సెమీకండక్టర్ల పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్న సింగపూర్ బృందం

రాష్ట్రంలో అత్యాధునికి మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయన్న ముఖ్యమంత్రి

సెమీకండక్టర్ పరిశ్రమకు పూర్తి స్థాయిలో సహకారాన్ని అందిస్తామని హామీ



**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ప్రభాత ఉదయం)**

భవిష్యత్తు ప్రపంచ సాంకేతిక రంగాన్ని, కృత్రిమ మేధస్సు విప్లవాన్ని శాసించబోతున్న సెమీకండక్టర్ రంగానికి తెలంగాణ ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరుస్తోంది. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే వ్యూహంలో భాగంగా, రాష్ట్రంలో సెమీకండక్టర్ పరికరాలు, చిప్ డిజైనింగ్, తయారీ పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. ఈ బృహత్తర ప్రణాళికలో భాగంగా, తెలంగాణలో సెమీకండక్టర్ల పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు సింగపూర్ బృందం ప్రకటించింది. శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డితో సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ శాశ్వత కార్యదర్శి (ఇంధన, వాణిజ్య విభాగం) అగస్టిన్ లీ నేతృత్వంలోని బృందం భేటీ అయి విస్తృతంగా చర్చలు జరిపింది. రాష్ట్రంలో అత్యాధునిక మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని, ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ పరిశ్రమలకు పూర్తి స్థాయిలో అనుమతులు, సబ్సిడీలు, సహకారాన్ని అందిస్తామని ఈ సందర్భంగా సీఎం హామీ ఇచ్చారు. హైదరాబాద్‌ను కేవలం పర్యాటక రంగంలోనే కాకుండా అంతర్జాతీయ నాలెడ్జ్ హబ్‌గా మారుస్తున్నామని స్పష్టం చేశారు. నెట్-జీరో కార్బన్ విధానంతో నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ, తొలిదశ మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి, నైట్ ఎకానమీ ప్రణాళికలను సింగపూర్ బృందానికి వివరించారు. ఇప్పటికే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు తమ ఆఫ్-షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు సూత్రప్రాయంగా అంగీకరించాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాబోయే డిసెంబరు నెలలో ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు సింగపూర్ బృందాన్ని సీఎం అధికారికంగా ఆహ్వానించారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు కూడా పాల్గొన్నారు.

# 22ఏ భూములపై గుడ్‌న్యూస్

## సీఎం రేవంత్ కీలక హామీలు



22ఏ సమస్యల్లో 12 అంశాలను గుర్తించినట్లు సీఎం వెల్లడి

యూఎల్‌సీ భూములపై త్వరలో కొత్త విధానం తీసుకొస్తామని ప్రకటన

పెండింగ్ రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తామని హామీ

పొరపాటున 22ఏలో చేరిన భూములు తొలగిస్తామని భరోసా

క్రమబద్ధీకరించిన, వేలం భూములకు 22ఏ నుంచి విముక్తి కల్పిస్తామన్న రేవంత్

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ప్రభాత ఉదయం)**

22ఏ భూముల సమస్యల పరిష్కారంపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోనుంది. 22ఏ సమస్యల్లో 12 రకాల అంశాలను గుర్తించామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో తెలిపారు. యూఎల్‌సీ భూముల విషయంలో ..మిగతా 2లో

# దానం అనర్హతపై విచారణ వాయిదా

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ప్రభాత ఉదయం)**



ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారం పై హైకోర్టులో కీలక వాదనలు జరిగాయి. దానం బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ లో చేరటం పైన హైకోర్టులో దాఖలైన పిటీషన్ ను న్యాయస్థానం విచారణ చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ బీ-ఫారంతో సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి పోటీచేయడం ఈ కేసులో కీలకంగా మారింది. ఈ పిటీషన్ ను విచారణ చేసిన న్యాయస్థానం ఈ రోజు తీర్పు వెల్లడించాల్సి ఉండగా శుక్రవారానికి వాయిదా వేసింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే ..మిగతా 2లో

# పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితి 25,000

కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం.. 51 లక్షల మంది లబ్ధి పొందే చాన్స్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16 (ప్రభాత ఉదయం)**



దేశంలో పనిచేస్తున్న కోట్లాది మంది వేతన జీవులకు కేంద్ర ప్రభుత్వం అద్భుతమైన వార్త అందించింది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ పరిధిలోకి వచ్చే సేవకుల వేతన పరిమితిని భారీగా పెంచుతూ కేంద్ర కేబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు నెలకు రూ. 15,000 ఉన్న ఈ పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితిని ఏకంగా రూ. 25,000కు పెంచుతూ కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ..మిగతా 2లో

# కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణ

## ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి... అసెంబ్లీలో ప్రకటన

30 రోజుల్లో నివేదిక: రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన

ఫామ్‌హౌస్‌లో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ఆరోపణ

నెల రోజుల్లో విచారణ పూర్తి చేయాలని అధికారులకు సూచన

ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంచుతామని సీఎం ప్రకటన

కల్వకుంట్ల కుటుంబానికి 439 ఎకరాలు ఉన్నాయని వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ప్రభాత ఉదయం)**

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై సమగ్ర విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. బుధవారం శాసనసభలో మాట్లాడిన ఆయన, ఈ విచారణను 30 రోజుల్లోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.కేసీఆర్‌కు 700 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందో లేదో నిగ్గుతేల్చాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఈ విషయాన్ని కేసీఆర్ ఎందుకు వెల్లడించలేదని ఆయన ..మిగతా 2లో

అక్టోబర్ 10 నుంచి 22 వరకు

# దసరా సెలవులు

తెలంగాణలో పాఠశాలలకు SA-1 పరీక్షల షెడ్యూల్ విడుదల

అక్టోబర్ 1 నుంచి 9 వరకు సమ్మేటివ్-1 పరీక్షలు

2లో..

వివిధ తరగతులకు వేర్వేరు సమయాల్లో పరీక్షల నిర్వహణ

ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా

# ప్రభుత్వానికే అప్పగిస్తా



అంతా అబద్ధం.. రేవంత్ రెడ్డి ఆరోపణలకు కవిత కౌంటర్

తనతో పాటు పలువురి ఆస్తులపైనా సీబీఐ విచారణకు డిమాండ్

అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలపై ఎదురుదాడి

గుంపు మేస్త్రీ, గుంటనక్క కలిసే ఉన్నారని కవిత విమర్శ

ముఖ్యమంత్రిపై తమకు నమ్మకం లేదని వ్యాఖ్య

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ప్రభాత ఉదయం)**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన భూ ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్రంగా స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క గజం భూమి అదనంగా ఉన్నట్లు నిరూపించినా, ఆ భూమిని ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె సవాల్ విసిరారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి తన కుటుంబంపై అసత్య ఆరోపణలు చేశారని, ఆయన మాటలపై తమకు విశ్వాసం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆమె డిమాండ్ చేశారు. కేవలం తనపైనే కాకుండా, అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రస్తావించిన 'గుంటనక్క'తో పాటు ..మిగతా 2లో

# అమెరికా ఎఫ్-15 జెట్ కూల్చివేత!

## సౌదీకి హుతీల మరో భారీ షాక్..!

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16 (ప్రభాత ఉదయం)**



పశ్చిమాసియాలో సౌదీ అరేబియా-హుతీల పోరు మరింత తీవ్రమవుతోంది. యెమెన్ లో ప్రభుత్వానికి సౌదీ అరేబియా మద్దతిస్తున్న నేపథ్యంలో.. అక్కడ రెబెల్స్ గా ఉన్న హుతీలు ఎదురుదాడులకు దిగుతున్నారు. ఇదే క్రమంలో ఎర్ర సముద్రంలోని బాబ్ ఎల్-మాండెబ్ ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తాజాగా ప్రకటించారు. తాజాగా మరో అడుగు ముందుకేసి సౌదీ అరేబియాలోని ముస్లింల పవిత్ర నగరం మక్కాపై డ్రోన్లు ప్రయోగించారు. అయితే వీటిని సౌదీ సమర్ధంగా అడ్డుకుని మక్కాలో అలర్ట్ ప్రకటించింది. ఈ ఘటన చోటు చేసుకున్న కొద్ది గంటల్లోనే యెమెన్ గగనతలంపై ఎగురుతున్న సౌదీ ఎఫ్ 15 ఫైటర్ జెట్ ను కూల్చేసినట్లు హుతీలు ప్రకటించారు. మిత్రదేశం అమెరికా నుంచి తీసుకుని వాడుతున్న ఎఫ్15 ఫైటర్ జెట్ ను హుతీలు కూల్చేయడం తీవ్ర సంచలనం రేపుతోంది. నిన్న మొన్నటివరకూ హుతీల్ని యెమెన్ లో ఇరాన్ మద్దతు కలిగిన ..మిగతా 2లో

# దానం అనర్హతపై విచారణ వాయిదా



**మొదటి పేజీ తరువాయి...**

దానం నాగేందర్ అనర్హత వ్యవహారం పై హైకోర్టు శుక్రవారం తీర్పు వెల్లడి చేయనుంది. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై, ఆ తర్వాత కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసిన దానంపై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్లను స్పీకర్ కొట్టివేసారు దీంతో.. ఇదే అంశం పైన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేసింది. బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికైన దానం నాగేందర్.. ఆ పార్టీకి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్‌లో చేరారని, పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు గండ్ర మోహన్‌రావు, కే వివేక్‌రెడ్డి ఇప్పటికే హైకోర్టుకు తెలిపారు. ముఖ్యంగా దానం బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ బీ–ఫారంతో సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి పోటీచేయడం ఈ కేసులో అత్యంత కీలక ఆధారమని తమ వాదనల్లో స్పష్టం చేసారు. అదే విధంగా పార్టీ ఫిరాయింపును నిర్ధారించేందుకు అసెంబ్లీ లోపల ఎమ్మెల్యే వ్యవహరించిన తీరును మాత్రమే పరిగణనలోకి తీసుకోవాల న్న స్పీకర్ వైఖరిని పిటిషనర్లు వ్యతిరేకించారు. మరో పార్టీ తరఫున పోటీచేయడం ద్వారా అసలు పార్టీ పట్ల తన రాజకీయ అనుబంధాన్ని వదులుకు న్నట్టు స్పష్టమవుతున్నప్పుడు వేరే ఆధారాల కోసం చూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. స్పీకర్ నిర్ణయం న్యాయపరమైన పరిశీలనకు లోబడి ఉంటుందని, స్పీకర్ అధికారాలు అపరిమిత మైనవి కావని వాదించారు. పిటిషనర్ల వాదనలతో దానం నాగేందర్ న్యాయవాది వ్యతిరేకించారు. ఆయన బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని, కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వాన్ని తీసుకున్నట్టు ఎకడా ప్రకటించలేదని తెలిపారు. దానం ఇప్పటికీ అసెంబ్లీ రికార్డుల్లో బీఆర్ఎస్ సభ్యుడిగానే ఉన్నారని చెప్పారు. దానం బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూ కాంగ్రెస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసినంత మాత్రాన అసెంబ్లీ సభ్యత్వం కోల్పోయినట్టు భావించరాదని వాదించారు. వాదనలు విన్న తరువాత ధర్మాసనం ఈ రోజు వెల్లడించాల్సి ఉండగా.. శుక్రవారానికి వాయిదా వేస్తూ న్యాయ స్థానం నిర్ణయం తీసుకుంది.



## కేసీఆర్ ఫాంహౌస్
# భూములపై విచారణ..

**మొదటి పేజీ తరువాయి...**

ప్రశ్నించారు. విచారణలో ఆ భూమి ప్రభుత్వానిదని తేలితే, దాన్ని నిరుపేదలకు పంచిపెడతామని సభలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కుటుంబానికి ఉన్న భూముల వివరాలను కూడా రేవంత్ రెడ్డి వెల్లడించారు. కేసీఆర్ కుటుంబానికి సిద్దిపేటలో 67.5 ఎకరాలు, కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు, హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు, కవిత కుటుంబానికి 37 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. తొమ్మిది జిల్లాల పరిధిలోని 24 మండలాల్లో కల్వకుంట్ల కుటుంబానికి మొత్తం 439 ఎకరాల భూమి ఉందని ఆయన పేర్కొన్నారు. జోగినపల్లి సంతోష్ కుమార్ కుటుంబానికి 79 ఎకరాలు, నవీన్ రావుకు 52 ఎకరాలు, కొండల్ రావుకు 48 ఎకరాల భూమి ఉందని వెల్లడించారు. కేటీఆర్ జన్వాడ ఫామ్ హౌస్‌పై తాను బాంబులు ఎందుకు వేస్తానని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. నేనేమైనా బిన్ లాడెన్‌నా అని ఆయన ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. అదే సమయంలో, ఎల్బీనగర్ పరిధిలోని జీవో 118 కింద ఉన్న భూముల క్రమబద్ధీకరణపై కూడా సీఎం కీలక ప్రకటన చేశారు. ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్న సుమారు 9,500 మందికి త్వరలోనే శుభవార్త అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా
# ప్రభుత్వానికే అప్పగిస్తా

**మొదటి పేజీ తరువాయి...**

కేసీఆర్ ఫాంహౌస్‌లోని సీఎం గూఢచారి, నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి తదితరులందరి భూములపై సమగ్ర విచారణ జరిపించాలని కవిత డిమాండ్ చేశారు. 'గుంపు మేస్త్రీ – గుంటనక్క' ముమ్మాటికీ కలిసే ఉన్నారని ఈ సందర్భంగా కవిత వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కానీ, ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించిన దానికంటే గజం భూమి అదనంగా ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలు, కవిత సవాల్‌తో రాష్ట్ర రాజకీయాల్లో భూముల వివాదం మరింత వేడెక్కింది.

# ఓటుకు నోటు కేసులో దర్యాప్తు వేగవంతం

## రేవంత్ రెడ్డి, సండ్ర పిటిషన్లపై సుప్రీంలో విచారణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ప్రభాత ఉదయం)**

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు' కేసుపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఈరోజు విచారణ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం (జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనా) విచారణ జరిపింది. తమపై నమోదైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు చట్టపరంగా చెల్లదని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారం ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య/ఎన్నికల నిబంధనలకు సంబంధించిందని, దీనిపై దర్యాప్తు చేసే అధికారిక పరిధి ఏసీబీకి లేదని స్పష్టం చేశారు. 2015లో కేసు నమోదైన నాటికి అమల్లో ఉన్న చట్టాలను ప్రస్తావిస్తూ... నాటి నిబంధనల ప్రకారం లంచం ఇవ్వడం/తీసుకోవడం అనే ప్రక్రియను ఎన్నికల కేసుగా చూడాలి తప్ప, అవినీతి నిరోధక చట్టం కింద నేరంగా పరిగణించలేమని న్యాయవాదులు వాదించారు. గతంలో ఈ కేసును సమగ్రంగా విచారించిన ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి పదవీ విరమణ చేయడంతో, ప్రస్తుత నూతన త్రిసభ్య ధర్మాసనం విచారణను మొదటి నుంచి చేపట్టింది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలను విన్న ధర్మాసనం, తదుపరి తుది విచారణ తేదీని త్వరలోనే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ద్వారా ఖరారు చేయనున్నట్లు వెల్లడించింది.

## తిరుమలలో ఉచిత
# ఈవీ బస్సుల సేవలు ప్రారంభం

## ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు

**తిరుమల సెప్టెంబర్ 16 (ప్రభాత ఉదయం)**

తిరుమల క్షేత్రంలో పర్యావరణ పరిరక్షణతో పాటు భక్తులకు మరింత సౌకర్యవంతమైన రవాణా సదుపాయాలను అందించేందుకు సిద్ధం చేసిన ఉచిత ఈవీ బస్సుల సేవలు బుధవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల శుభసందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఉచిత ఎలక్ట్రిక్ బస్సులను తిరుమలలో ఘనంగా ప్రారంభించారు. పర్యావరణహిత రవాణా కోసం రిలయన్స్ సంస్థ 25 ఎలక్ట్రిక్ బస్సులను అందించగా, బయోటెక్ సంస్థ 7 బస్సులను టీటీడీకి ఉచితంగా అందజేసింది. బస్సులతో పాటుగా 'జియో–బీపీ' సహకారంతో ప్రత్యేక ఎలక్ట్రిక్ వాహన ఛార్జింగ్ స్టేషన్, ఇతర మౌలిక సదుపాయాలను రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేసింది. గత జూన్ నెలలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ, తిరుమల కొండపై కాలుష్యాన్ని తగ్గించేందుకు టీటీడీకి రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా 25 ఈవీ బస్సులను విరాళంగా ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు బస్సులు కొండపైకి చేరుకుని నేడు భక్తుల సేవలకు అందుబాటులోకి వచ్చాయి. బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు మాడ వీధులు, కాటేజీలు మరియు దర్శన క్యూలైన్ల వద్దకు ఉచితంగా చేరుకోవడానికి ఈ బస్సులు ఎంతగానో ఉపయోగపడనున్నాయి.



# 22ఏ భూములపై గుడ్‌న్యూస్

**మొదటి పేజీ తరువాయి...**

త్వరలో కొత్త విధానం తీసుకొస్తామని చెప్పారు. అధీకృత లేఅవుట్లలో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తామని సీఎం ప్రకటించారు. హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతులు ఉన్న లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు కూడా చేస్తామన్నారు. ఇకపై 22ఏ జాబితాలో భూమిని చేర్చడం, తొలగించడం కోసం స్పష్టమైన నిబంధనలు తీసుకొస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. పొరపాటున వ్యక్తిగత భూములు 22ఏ జాబితాలో చేరితే కలెక్టర్లు, ఆర్డీవోలు వాటిని తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం క్రమబద్ధీకరించిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని తెలిపారు. జీవో 166, జీవో 59, జీవో 58 కింద క్రమబద్ధీకరించిన భూములకు కూడా ఇది వర్తిస్తుందన్నారు. వేలంలో కొనుగోలు చేసిన భూములు, బ్యాంకుల్లో తనఖా పెట్టి వేలం వేసిన భూములను కూడా 22ఏ జాబితా నుంచి తొలగిస్తామని చెప్పారు. ధరణి వ్యవస్థపై గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సీఎం విమర్శించారు. నీటి ప్రాజెక్టుల తర్వాత కేసీఆర్ దృష్టి భూములపై పడిందని ఆరోపించారు. భూదోపిడీ ఆలోచనల నుంచే ధరణి పుట్టిందన్నారు. కేసీఆర్, సోమేశ్‌కుమార్ కలిసి ధరణిని రూపొందించారని చెప్పారు. ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టిందన్న ఆరోపణలపైనా రేవంత్ స్పందించారు. అసలు వివాదం 3.73 లక్షల ఎకరాల ప్రైవేట్ పట్టా భూముల గురించేనన్నారు. వాటిని చూపించి కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారంటూ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. హైకోర్టు ఆదేశాల మేరకు 2025లో నిషేధిత భూముల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచామని సీఎం తెలిపారు.

## అక్టోబర్ 10 నుంచి 22 వరకు
# దసరా సెలవులు

## తెలంగాణలో పాఠశాలలకు SA-1 పరీక్షల షెడ్యూల్ విడుదల
## అక్టోబర్ 1 నుంచి 9 వరకు సమ్మేటివ్-1 పరీక్షలు
## వివిధ తరగతులకు వేర్వేరు సమయాల్లో పరీక్షల నిర్వహణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థులకు విద్యార్థులకు ముఖ్యమైన అప్‌డేట్. రాష్ట్రంలో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సంబంధించి సమ్మేటివ్ అసెస్‌మెంట్–1 (సా–1) పరీక్షల షెడ్యూల్‌తో పాటు దసరా సెలవులను విద్యాశాఖ వెల్లడించింది. దీని ప్రకారం, అక్టోబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు సా–1 పరీక్షలు జరగనున్నాయి. అనంతరం అక్టోబర్ 10 నుంచి 22వ తేదీ వరకు పాఠశాలలకు దసరా సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. పరీక్షల నిర్వహణలో సౌలభ్యం కోసం తరగతుల వారీగా వేర్వేరు సమయాలను కేటాయించారు.

పరీక్షల సమయాల వివరాలు ఇలా ఉన్నాయి:

1 నుంచి 5వ తరగతి వరకు: విద్యార్థులకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు

6, 8వ తరగతులకు: ఉదయం 9:15 నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు

7వ తరగతికి మధ్యాహ్నం 1:15 నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు

9వ తరగతికి మధ్యాహ్నం 1:15 నుంచి సాయంత్రం 4:15 గంటల వరకు

10వ తరగతి విద్యార్థులకు ఉదయం 9:15 నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

కాగా, తరగతుల వారీగా ఆయా సబ్జెక్టుల పరీక్ష తేదీలతో కూడిన పూర్తి స్థాయి కూడిన టైమ్ టేబుల్ ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం విద్యార్థులు, ఉపాధ్యాయులు పరీక్షలకు సన్నద్ధం కావాలని విద్యాశాఖ సూచించింది.

# అమెరికా ఎఫ్-15 జెట్ కూల్చివేత!

**మొదటి పేజీ తరువాయి...**

చిన్న రెబెల్ గ్రూప్ గా పరిగణించిన వారికి ఇప్పుడు వారి సత్తా తెలుస్తోంది. ఇరాన్ ఇచ్చిన క్షిపణులు, డ్రోన్లతో సౌదీ మీద హూతీలు చేస్తున్న యుద్ధం నిత్యం వార్తల్లో నిలుస్తోంది. యెమెన్‌లోని వివాదాస్పద మరిబ్ ప్రావిన్స్ గగనతలంలో సౌదీ అరేబియాకు చెందిన ఎఫ్–15 యుద్ధ విమానాన్ని విజయవంతంగా కూల్చివేసినట్లు హూతీ సైనిక దళాలు ప్రకటించాయి. తమ స్వదేశీ సాంకేతికతతో తయారు చేసిన ఉపరితలం నుండి గగనతలంలోకి దూసుకెళ్లే అత్యాధునిక క్షిపణి సహాయంతో ఈ విమానాన్ని నేలకూల్చినట్లు హూతీ ప్రతినిధి యాహ్యా సారీ తెలిపారు. అయితే హూతీల ఆరోపణలను సౌదీ అరేబియా ప్రభుత్వం ధృవీకరించలేదు. మక్కా నగరం తమకు అత్యంత పవిత్రమైనదని, దాని భద్రత విషయంలో ఎలాంటి రాజీపడే ప్రసక్తి లేదని సౌదీ సంకీర్ణ దళాలు హెచ్చరించాయి. కాగా తాము పవిత్ర ఇస్లామిక్ క్షేత్రాలకు ఎలాంటి హాని తలపెట్టలేదని హూతీ ప్రతినిధులు స్పష్టం చేశారు.

# పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితి 25,000

**మొదటి పేజీ తరువాయి...**

ప్రతిపాదించిన బిల్లుకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ సంచలన నిర్ణయాన్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియా సమావేశంలో వివరంగా వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో దేశవ్యాప్తంగా సుమారు 51 లక్షల మంది ఉద్యోగులకు నేరుగా లబ్ధి చేకూరనుందని ఆయన తెలిపారు. ఈ సామాజిక భద్రతా పథకం విస్తరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం తరఫున రూ. 11,339 కోట్ల నిధులను ఖర్చు చేయబోతోంది. ఈ నిర్ణయం సెప్టెంబర్ 17 నుంచే అమలులోకి రానుంది. గతంలో 2004 నుంచి 2014 వరకు పీఎఫ్ వేతన పరిమితి ఎలాంటి మార్పూ లేకుండా కొనసాగింది. అనంతరం సెప్టెంబర్ 2014లో దీనిని రూ. 15,000కు పెంచారు. దాదాపు దశాబ్ద కాలం తర్వాత మళ్లీ ఇప్పుడు రూ. 25,000కు పెంచడం విశేషం. అనేక రాష్ట్రాల్లో కనీస వేతనాలు ఇప్పటికే రూ. 15,000 కంటే దాటిపోయిన నేపథ్యంలో 2014 పరిమితి కాలం చెల్లినదైందని, అందుకే సమగ్ర సంప్రదింపుల తర్వాత ఈ సీలింగ్‌ను రూ. 25 వేలకు పెంచినట్లు మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. రూ. 15,000 కంటే ఎక్కువ జీతంతో కొత్తగా ఉద్యోగంలో చేరే చాలామందికి పీఎఫ్, పెన్షన్, సంబంధిత బీమా రక్షణ లభించేది కాదు. తాజాగా వేతన సీలింగ్‌ను రూ. 25,000కి పెంచడం వల్ల రూ. 15,000 నుంచి రూ. 25,000 మధ్య సంపాదించే మధ్యతరగతి ఉద్యోగులందరూ ఇకపై చట్టబద్ధంగా ఈపీఎఫ్ పరిధిలోకి వస్తారు. ఇది ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్లను పెంచడమే కాకుండా, ప్రైవేటు సంస్థల యాజమాన్యాలకు తమ సిబ్బందికి మెరుగైన సామాజిక భద్రత కల్పించేందుకు ఉపయోగపడుతుంది.



ఓజోన్ పరిరక్షణపై మాట్లాడుతున్న ముఖ్య అతిథి.



సమావేశానికి హాజరైన విద్యార్థులు..

# ఓజోన్ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

## లింగంపల్లి ప్రభుత్వ పాఠశాలలో అవగాహన సదస్సు

**శేరిలింగంపల్లి : సెప్టెంబర్ 16,(ప్రభాత ఉదయం)**

సూర్యుడి నుంచి వెలువడే హానికరమైన అతినీలలోహిత కిరణాల నుండి భూమిపై ఉన్న జీవరాశులను కాపాడే ఓజోన్ పొరను రక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం భూ, వాతావరణ శాస్త్రాల కేంద్రం ఆచార్యులు జి. కిషోర్ కుమార్ పిలుపు నిచ్చారు. అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని లింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. అనుపమ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆచార్య కిషోర్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి ఉపరితలం నుంచి 15 నుండి 35 కిలోమీటర్ల ఎత్తులో ఉండే ఓజోన్ పొర సూర్యుని హానికర కిరణాలను పీల్చుకుని సహజ రక్షణ కవచంలా పనిచేస్తుందన్నారు. శీతలీకరణ యంత్రాల నుంచి వెలువడే రసాయనాల వల్ల ఓజోన్ పొరకు నష్టం జరుగుతోందని వీటికి ప్రత్యామ్నాయంగా పర్యావరణహిత వాయువులను, విద్యుత్ ఆదా చేసే పరికరాలను మాత్రమే వాడాలని సూచించారు. వాతావరణంలో పైపొరల్లో ఉండే ఓజోన్ మేలు చేస్తే మనం నివసించే భూమికి దగ్గరగా ఉండే పొరల్లో ఓజోన్ పెరిగితే అది వాయు కాలుష్యంగా మారి ఆరోగ్యాన్ని, పంటలను దెబ్బతీస్తుందని చెప్పారు. అడవుల నరికివేతను అరికట్టడం, మొక్కలు నాటడం, పునరుత్పాదక ఇంధన వనరులను వాడడం, ఒక్కసారి మాత్రమే వాడి పారేసే ప్లాస్టిక్‌ను నిషేధించడం వంటి చర్యలు చేపట్టాలని వివరించారు. అనంతరం ఓజోన్ పొర కాపాడుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిత, సరిత, శ్రీకాంత్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అమ్మయ్య చౌదరి, బాలన్న విద్యార్థులు పాల్గొన్నారు.

# భూదాన్, గైరాన్, మిగులు, సీలింగ్ భూముల వివరాలు వెల్లడించాలి

## 22-ఏ జాబితాలో ప్రైవేటు ఆస్తులపై సమగ్ర సమీక్ష చేపట్టాలి

రాజేంద్రనగర్,సెప్టెంబర్16(ప్రభాత ఉదయం)



రంగారెడ్డి జిల్లాలోని భూదాన్,గైరాన్,మిగులు,సీలింగ్ భూముల పూర్తి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ కట్టా వెంకటేష్ గౌడ్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.భూముల రికార్డులను సమగ్రంగా పరిశీలించి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా వివరాలను వెల్లడించాలని కోరారు.అదేవిధంగా రిజిస్ట్రేషన్ చట్టం,1908లోని సెక్షన్ 22-ఏ నిషేధిత ఆస్తుల జాబితాలో ప్రైవేటు ఆస్తులను తప్పుగా,పరిమితికి మించి లేదా మొత్తంగా చేర్చడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.ప్రభుత్వ భూములు,చట్టబద్ధంగా రక్షించాల్సిన ఇతర ఆస్తులను అక్రమ విక్రయాలు,ఆక్రమణలు, మోసపూరిత లావాదేవీలు,నకిలీ పత్రాల నుంచి కాపాడాల్సిన అవసరం ఉందని తెలిపారు.అయితే నిషేధిత వర్గాలకు చెందని నిజమైన ప్రైవేటు ఆస్తులను 22-ఏ పరిధిలోకి తీసుకురావడం వల్ల ఆస్తిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. 22-ఏ జాబితాలో ఉన్న భూముల రికార్డులను సమగ్రంగా సమీక్షించి, తప్పుగా చేర్చిన ఆస్తులను గుర్తించి సవరణలు చేపట్టాలని,ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి సమర్థవంతమైన విధానాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు.భూదాన్‌భూములు, గైరాన్‌భూములు,మిగులు భూములు, సీలింగ్‌భూములకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయడం ద్వారా భూ వివాదాలు,అపోహలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు.ఈ మేరకు జిల్లా యంత్రాంగం తక్షణమే చర్యలు చేపట్టాలని చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ కట్టా వెంకటేష్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.జిల్లా కలెక్టర్ ను కలిసిన వారిలో ఎం.రామేశ్వర్ రావు,రఘురాజ్ గౌడ్, కే.తమోదంరావు,ఎ.బాలరాజ్, శ్రీనివాస్ రెడ్డి,కొండారెడ్డి, తదితరులు ఉన్నారు.



# పత్తికుంట హనుమాన్ సాగర్‌లో భక్తులకు ఘన స్వాగతం పలికిన

## భాగ్యనగర్ గణేశ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ వై.శ్రీధర్

రాజేంద్రనగర్,సెప్టెంబర్16(ప్రభాత ఉదయం)

రాజేంద్రనగర్‌లోని పత్తికుంట హనుమాన్ సాగర్‌లో మూడో రోజు గణేష్ నిమజ్జన కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తూ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు.నిమజ్జనం కోసం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తూ సేవలు అందించారు.ఈ సందర్భంగా భాగ్యనగర్ గణేశ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ వై.శ్రీధర్,జాయింట్ కన్వీనర్ వేణుగోపాల్,రాజేందర్,సురేందర్ రెడ్డితో పాటు జీహెచ్‌ఎంసీ సిబ్బంది భక్తులకు స్వాగతం పలికి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించారు.భక్తులకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టారు.గణనాథుడి నిమజ్జనానికి తరలివచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి అనంతరం నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూ సేవలందించిన నిర్వాహకులు,జీహెచ్‌ఎంసీ సిబ్బందికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.



చెరువుల వద్ద నిమజ్జనం ఏర్పాట్లు పై మీడియాతో మాట్లాడుతున్న సిపి డాక్టర్ ఎం రమేష్, జిహెచ్ఎంసి సైబరాబాద్ కమిషనర్ సృజన , వివిధ శాఖల అధికారులు..

# వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

## సైబరాబాద్ సీపీ, జీహెచ్‌ఎంసీ కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన

## ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరగాలి పోలీసు, మున్సిపల్ అధికారులతో సీపీ సమీక్ష

## చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్ల తీరు పరిశీలించిన సీపీ రమేష్, కమిషనర్ సృజన

## గణేష్ నిమజ్జనానికి సైబరాబాద్ వ్యాప్తంగా భారీ ఏర్పాట్లు

## సర్వసన్నద్ధంగా సైబరాబాద్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు

శేరిలింగంపల్లి :,సెప్టెంబరు 16, (ప్రభాత ఉదయం)

వినాయక నిమజ్జనోత్సవాన్ని అత్యంత ప్రశాంతంగా సురక్షితమైన వాతావరణంలో నిర్వహించేందుకు సైబరాబాద్ పోలీసు మున్సిపల్ శాఖ అధికారులు సంయుక్తంగా పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నాయి. ఈ క్రమంలో నిమజ్జన ఏర్పాట్లపై బుధవారం సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ జి. సృజన ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అనంతరం కమిషనరేట్ పరిధిలోని ప్రధాన నిమజ్జన ప్రాంతాలను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఐడీపీఎల్, సూరారం తదితర ప్రధాన చెరువుల వద్ద నిమజ్జనం కోసం పూర్తి చేసిన ఏర్పాట్లను సీపీ స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ నిమజ్జనం కోసం తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అప్రమత్తతో పనిచేయాలని ఆదేశించారు. చెరువుల వద్ద బందోబస్తు, బారికేడ్ల ఏర్పాటు, నిరంతర విద్యుత్తు సరఫరా, గజ ఈతగాళ్ల లభ్యత వంటి భద్రతా ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళిక భారీగా తరలివచ్చే వాహనాలు, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అధికారులకు సీపీ సూచించారు. ట్రాఫిక్ మళ్లింపులు, ప్రత్యామ్నాయ మార్గాలు, అవసరమైన ప్రాంతాల్లో అదనపు బలగాలు బారికేడ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. భద్రత విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా, సైబరాబాద్ వ్యాప్తంగా నిమజ్జనం విజయవంతం అయ్యేలా పర్యవేక్షించాలన్నారు. ఈ తనిఖీలు సమీక్షా సమావేశంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ జి. సృజన, జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్, డీసీపీలు కోటి రెడ్డి, రీతిరాజ్, ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిణి రెడ్డి, ఎస్బీ డీసీపీ సువేంద్రతో పాటు వివిధ శాఖల అదనపు డీసీపీలు, ఏసీపీలు, మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ, దేవాదాయ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ హెచ్ 82 ఉద్యోగుల యూనియన్ నూతన కార్యవర్గం

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 16(ప్రభాత ఉదయం)

రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ హెచ్ 82 ఉద్యోగుల యూనియన్ కమిటీని ఎన్నుకున్నారు. బుధవారం యూనియన్ రాష్ట్ర కార్యదర్శులు సాయిల్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ అందులో రాజేంద్రనగర్ , షాద్ నగర్, కందుకూరు డివిజన్ ల ను కలిపి రాజేంద్రనగర్ సర్కిల్ నూతన కమిటీని ఎన్నుకున్నారు .అందులో భాగంగా సర్కిల్ ప్రెసిడెంట్ గా కావలి ఆంజనేయులు, సర్కిల్ సెక్రెటరీ కిరణ్ , వర్కింగ్ ప్రెసిడెంట్ కుమార్ స్వామి, సభ్యులను సర్కిల్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కమిటీకి కార్మికులు శుభాకాంక్షలు తెలియజేశారు. సర్కిల్ సెక్రెటరీ కిరణ్ మాట్లాడుతూ... కార్మికుల సమస్యలపై ఎల్లప్పుడూ స్పందిస్తూ కార్మికులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని యూనియన్ కు సాయి సహకారాలు అందిస్తానని రాష్ట్ర నాయకులకు తెలియజేశారు.

# జీరం ఘాటీ నరమేధం కేసులో మరణశిక్ష

## 10 మంది మావోయిస్టులకు శిక్ష విధిస్తూ చారిత్రక తీర్పు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16 (ప్రభాత ఉదయం)

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా జీరం ఘాటీ వద్ద 2013లో కాంగ్రెస్ 'పరివర్తన్ యాత్ర' కాన్వాయ్‌పై దాడి చేసిన మావోయిస్టులు 29 మందిని అతి దారుణంగా హత్య చేయడం సంచలనం సృష్టించింది. తాజాగా, ఈ దాడి కేసులో జగదల్‌పూర్‌లోని ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం కీలకమైన తీర్పును వెలువరించింది. ఈ కేసులో దోషులుగా తేలిన మొత్తం 10 మంది మావోయిస్టులకు మరణశిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2013లో జీరం ఘాటీ అటవీ ప్రాంతంలో సుమారు 150 మందికి పైగా మావోయిస్టులు జరిపిన ఆకస్మిక దాడిలో ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ అగ్రనాయకత్వం తుడుచుపెట్టుకుపోయింది. ఈ దారుణ నరమేధంలో కేంద్ర మాజీ మంత్రి విద్యాచరణ్ శుక్లా, నాటి పీసీసీ అధ్యక్షుడు నంద్ కుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేష్ పటేల్, 'సల్వా జుడుం' వ్యవస్థాపకుడు మహేంద్ర కర్మా సహా మొత్తం 29 మంది ప్రాణాలు కోల్పోయారు. దోషులపై భారత శిక్షా స్మృతిలోని హత్య, కుట్ర సెక్షన్లతో పాటు చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఎన్ఐఏ కోర్టు ఈ కఠిన శిక్షను ఖరారు చేసింది. భారత రాజకీయ మరియు భద్రతా చరిత్రలో చోటుచేసుకున్న అతిపెద్ద తీవ్రవాద దాడుల్లో ఒకటైన ఈ కేసులో 13 ఏళ్ల తర్వాత బాధితుల కుటుంబాలకు న్యాయం జరిగిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ద్వారా ఇండియన్ హ్యుమానిటేరియన్ అవార్డును అందుకున్న టీఎస్ సీఎస్ అధ్యక్షులు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్

బుద్వేల్, సెప్టెంబరు 16 (ప్రభాత ఉదయం)




అవార్డుతో డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్

వైద్య రంగం, స్వచ్ఛంద రక్తదానం, విద్య, రోగుల సంక్షేమ సమాజాభివృద్ధికి తలసేమియ సికిల్ సెల్ సొసైటీ (టీఎస్ సీ ఎస్) చేస్తున్న కృషిని గుర్తించిన ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతిష్టాత్మకమైన ఇండియన్ హ్యూమానిటేరియన్ అవార్డును టీఎస్సీఎస్ కు బహుకరించింది. ఈ అవార్డును టీఎస్సీఎస్ అధ్యక్షులు, పారిశ్రామికవేత్త, కమ్యూనిటీ లీడర్గా ఉన్నటువంటి డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్, సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గా ఉన్న రత్నావళి కొత్తపల్లి లకు అం దజేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం శివరాంపల్లి రాఘవేంద్ర కాలనీ లో తలసేమియ, సికిల్ సెల్ సొసైటీ (టీఎస్ సీఎస్) ఉంది. తలసేమియ వ్యాధి తో బాధపడుతున్న వేలాది మంది చిన్నారులకు ఈ సం స్థ ఇప్పటి వరకు అండగా నిలిచింది. ఆ సంస్థ కు అధ్యక్షులుగా ఉన్న డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్ చేసు న్న నిస్వార్థమైన సేవ ను ఇండియన్ బుక్ అఫ్ రికార్డ్స్ గుర్తించి అవార్డుతో సన్మానించింది. సమాజంలో ఆశను, గౌరవాన్ని, కరుణను. సానుకూల మార్పును తీసుకురావడానికి టీఎస్ సీఎస్ చేస్తున్న అంకితభావం, ఆ సంస్థ లో డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్ తో పాటు ఆ సంస్థ ప్రతినిధులు చేస్తున్న సేవలను గుర్తిస్తు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రశంసలతో ముంచెత్తింది. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్ మాట్లాడుతూ, తలసేమియ సికిల్ సెల్ సొసైటీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు దేశంలోని అనేక రాష్ట్రాలకు చెందిన తలసేమియ వ్యాధిగ్రస్థులను అక్కున చేర్చుకుని వారికి సేవలు అందిస్తుం దన్నారు. ఈ కార్యక్రమాలలో తలసేమియ సికిల్ సెల్ సొసైటీ ప్రతినిధులు అందరు ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్నారన్నారు.



# మాధవాని కుంట వద్ద ఘనంగా వినాయక నిమజ్జన ఏర్పాట్లు

## సీసీ కెమెరాలతో నిరంతర నిఘా

## ఏర్పాట్లను పరిశీలించిన బొల్లారం, మియాపూర్ పోలీసులు

పటాన్ చెరు, సెప్టెంబర్ 17 (ప్రభాత ఉదయం):

బొల్లారం డివిజన్ పరిధిలోని మాధవాని కుంట వద్ద వినాయక నిమజ్జనానికి సంబంధించి అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. నిమజ్జన ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సాగేందుకు బొల్లారం పోలీసులు, జీహెచ్‌ఎంసీ/సీఎంసీ సంయుక్తంగా నిరంతర పర్యవేక్షణ కోసం సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లను బుధవారం ఐడీఏ బొల్లారం పోలీస్ ఇన్‌స్పెక్టర్ సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. విగ్రహాల నిమజ్జనం కోసం భారీ క్రేన్లు, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు (లైటింగ్) ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించడంతో పాటు, ఏ క్షణమైనా తక్షణమే స్పందించేందుకు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్లు సీఐ సుధీర్ కుమార్ వెల్లడించారు. అలాగే నిమజ్జనం సమయంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ఆయన మాధవాని కుంట పరిసర ప్రాంతాలను పరిశీలించి, వాహనాల దారిమళ్లింపు, పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులు పోలీసులకు సహకరించి నిమజ్జనాన్ని ప్రశాంతంగా పూర్తి చేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# ముగిసిన కబడ్డీ ఎంపిక పోటీలు





గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 16 (ప్రభాత ఉదయం)

జోగులాంబ గద్వాల జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షురాలు డీకే. స్నిగ్ధ రెడ్డి ఆధ్వర్యంలో గద్వాలలోని ఇండోర్ స్టేడియంలో జూనియర్ బాలుర, సబ్‌జూనియర్ బాలికల కబడ్డీ ఎంపిక పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో ముగిశాయి. జూనియర్ బాలుర విభాగంలో సుమారు 90 మంది క్రీడాకారులు పాల్గొనగా, వారి ప్రతిభ ఆధారంగా 20 మందిని జిల్లా శిక్షణ క్యాంప్‌కు ఎంపిక చేశారు. సబ్‌జూనియర్ బాలికల విభాగంలో సుమారు 80 మంది క్రీడాకారులు పాల్గొనగా, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 16 మందిని క్యాంప్‌కు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా బీజేపీ అధ్యక్షులు టీ. రామాంజనేయులు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట్రాములు, ఇంచార్జ్ డివైఎస్‌ఓ బషీర్, రజక నర్సింహులు, రిటైర్డ్ పీడీలు బాలరాజ్, ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... క్రీడాకారులు కబడ్డీలో ప్రతిభను చాటుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణతో కూడిన శిక్షణ పొంది రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో రాణించి జోగులాంబ గద్వాల జిల్లా పేరును మరింత ఎత్తుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ కబడ్డీ నర్సింహాతో పాటు చందు, రవి, పాషా, నగేష్, వెంకటన్న , రామ్ , డ్యామ్ శివ, గీతా రెడ్డి, రాజశేఖర్; పీడీలు హైమావతి, స్రవంతి, జగదీష్; పీఈటీలు అరుణతార, శివాని, హుస్సేన్, భరత్; సీనియర్ క్రీడాకారులు బుజ్జిబాబు, మహేష్, శివశంకర్, పేపర్ నర్సింహా, నవీన్,తదితరులు పాల్గొన్నారు.

# పటాన్‌చెరులో తీరని విషాదం

## వినాయక నిమజ్జనంలో ఆరుగురు అనాథ విద్యార్థులు జలసమాధి

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 17 (ప్రభాత ఉదయం):**

కన్నవారిని కోల్పోయి, తలదాచుకున్న ఆశ్రమంలోనే బంగారు భవిష్యత్తును వెతుక్కుంటున్న ఆ అనాథ విద్యార్థుల ఆశలు నీటిపాలయ్యాయి. గణపతి బప్పాను సాగనంపే వేడుక వారి జీవితాల్లో పూడ్చలేని శోకాన్ని మిగిల్చింది. సరదాగా సాగిన నిమజ్జనం మృత్యుఘోషగా మారి, ఆరుగురు విద్యార్థులు నీటమునిగి ప్రాణాలు కోల్పోయిన హృదయవిదారక ఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పెద్దకంజర్లలో గురువారం చోటుచేసుకుంది.

మట్టి గుంతల రూపంలో పొంచి ఉన్న మృత్యువు

పెద్దకంజర్ల శివనగర్ చౌరస్తా వద్ద ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కృష్ణంరాజు తన కుమార్తె జ్ఞాపకార్థం 'శిరీష చారిటబుల్ ట్రస్ట్'ను నడుపుతున్నారు. ఇక్కడ తల్లిదండ్రులు లేని దాదాపు 70 మంది పిల్లలకు ఆశ్రయం కల్పిస్తూ ఒకటో తరగతి నుంచి పాలిటెక్నిక్, బీటెక్ వరకు చదివిస్తున్నారు. గురువారం ట్రస్ట్‌లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు విద్యార్థులు సమీపంలోని నేరేడుచెరువు వద్దకు వెళ్లారు.

విగ్రహాన్ని నీటిలోకి తీసుకెళ్లే క్రమంలో, అక్రమ మట్టి తవ్వకాల వల్ల ఏర్పడిన లోతైన గోతులను విద్యార్థులు గమనించలేకపోయారు. అక్కడ లోతు ఎక్కువగా ఉండటం, విద్యార్థులకు ఈత రాకపోవడంతో ఒకరినొకరు రక్షించుకునే ప్రయత్నంలో ఆరుగురు విద్యార్థులు ఒకేసారి నీటిలో మునిగిపోయారు. తోటి విద్యార్థుల కేకలు విని స్థానికులు పరుగున వచ్చి బయటకు తీసి, హుటాహుటిన పటాన్‌చెరులోని ప్రాచీన్ ఆసుపత్రికి తరలించారు. అయితే,



అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

మృతుల వివరాలు:

నర్సింహ రాజు (డిప్లొమా సెకండ్ ఇయర్)
సుమంత్ (డిప్లొమా సెకండ్ ఇయర్)
గణేష్ (డిప్లొమా సెకండ్ ఇయర్)
ఉదయ్ కిరణ్ (డిప్లొమా థర్డ్

శ్యామ్ కుమార్ (డిప్లొమా ఫస్ట్ ఇయర్)
సిద్ధార్థ్ (10వ తరగతి)
కన్నీరుమున్నీరైన ఆశ్రమ వాసులు

ఘటనా స్థలానికి సైబరాబాద్ డీసీపీ శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేరుకుని ఆసుపత్రిలో మృతదేహాలను పరిశీలించారు. ట్రస్ట్ నిర్వాహకులను, తోటి విద్యార్థులను అడిగి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. బాధ్యతాయుత పౌరులుగా ఎదిగి సమాజంలో గౌరవంగా బతకాలన్న ఆశలతో చదువుకుంటున్న విద్యార్థులు ఇలా అకాల మృత్యువాత పడటంతో తోటి విద్యార్థులు, ఆశ్రమ నిర్వాహకులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఈ విషాద ఘటనతో పెద్దకంజర్ల గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి.








# జడ్చర్లలో చిన్న వినాయకుల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు

## మూడు ప్రాంతాల్లో తాత్కాలిక పాండ్స్ ఏర్పాటు.. మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో ప్రారంభం

**జడ్చర్ల, సెప్టెంబర్ 16 (ప్రభాత ఉదయం)**

మున్సిపాలిటీ పరిధిలో చిన్న వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం మున్సిపల్ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బుధవారం నుంచి చిన్న వినాయకుల నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలో, హౌసింగ్ బోర్డు ప్రాంతంలో, బీసీ హాస్టల్ వెనుక కల్వకుర్తి రోడ్ పార్కులో తాత్కాలిక నిమజ్జన పాండ్స్‌ను ఏర్పాటు చేశారు.వినాయక చవితి సందర్భంగా భక్తులు ప్రతిష్ఠించిన చిన్న వినాయక విగ్రహాలను సులభంగా, సురక్షితంగా నిమజ్జనం చేసేందుకు ఈ తాత్కాలిక పాండ్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. నిమజ్జనం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మున్సిపాలిటీ పరిధిలోనే ప్రత్యేక సౌకర్యం కల్పించడంతో భక్తులకు ఇబ్బందులు తగ్గనున్నాయి.ఈ నిమజ్జన ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ శ్రీ గిరీష్ ప్రారంభించారు. కార్యక్రమంలో టీపీఓ లక్ష్మీపతి, మేనేజర్ లక్ష్మన్న, ఏఈ గాయత్రి, ఆర్ఓ సలాం, ఆర్ఐ నాగేష్ తదితర మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా భక్తులు మున్సిపల్ అధికారులు సూచించిన ప్రాంతాల్లోనే నిమజ్జనం చేయాలని, తాత్కాలిక పాండ్స్‌ను వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగేలా అవసరమైన ఏర్పాట్లను మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షించనున్నారు.



# జిల్లా కలెక్టర్, ఎస్పీలకు రేపల్లె ఘటనపై మెమొరండం అందజేసిన సంఘాల జేఏసీ నాయకులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 15 ( ప్రభాత ఉదయం)**

గద్వాల జిల్లా కలెక్టర్, ఎస్ పి కి రేపల్లె గ్రామ సంఘటన పై మెమోరాండం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా అఖిల పక్ష నాయకులు, బహుజన, ప్రజా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ...రేపల్లె గ్రామంలో ప్రేమ పెళ్లి విషయంలో దళిత అబ్బాయి ఇంటిని,బీసీ సామాజిక వర్గం అమ్మాయి తరపు వాళ్లు కుల వివక్ష తో కూల్చడం జరిగింది. దీనిని ఖండిస్తూ అఖిల పక్ష,బహుజన, ప్రజా సంఘాల తరఫున కలెక్టర్ కి మెమోరాండం సమర్పించడం జరిగింది. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కమిటీ నాయకులు కలెక్టర్ రిజ్వాన్ షేక్ కి వివరించడం జరిగింది. అదేవిధంగా గ్రామాన్ని సందర్శించి ఇంకా వివరాలన్నీ సేకరించి, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరడం జరిగింది. ఈమధ్య కాలంలో చాలా గ్రామాలలో కులాంతర ప్రేమ వివాహాల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. కాబట్టి ప్రజలకు చట్టం పట్ల,నిబంధనల పట్ల సామాజిక చైతన్యం కలిగే టట్లు అధికారుల చేత, సామాజిక కార్యకర్తల, మరియు లాయర్ల చేత ప్రతి వారం గ్రామాలలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని కోరడం జరిగింది.దళిత కుటుంబం ఇంటిని పునర్ నిర్మించాలని, వారికి తగిన నష్టపరిహారం ఎస్ సి, ఎస్ టి సబ్ ప్లాన్ ప్రకారం చెల్లించాలని కోరారు . ఇంటిని కూల్చివేయడానికి ప్రయత్నించిన నిందితులను అరెస్టు చేయడం తో పాటు,సర్పంచ్ ను కూడా విచారణ చేయాలని కోరుతున్నాము. జోగులాంబ గద్వాల జిల్లాలో చాలా గ్రామాలలో రాజకీయ నాయకుల వల్ల గొడవలకు ఆస్కారం లేకుండచూడాలి.ఇలాంటివి జరిగినప్పుడు చట్టపరమైన చర్యలతో పాటు,ప్రజల్ని నిత్యం సామాజికంగా చైతన్యం చేయాలి. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష, బహుజన, ప్రజా సంఘాల నాయకులు బి ఆర్ ఎస్ నాగరుదొడ్డి వెంకట రాములు, సి పి ఎం వెంకటస్వామి,సిపిఐ ఆంజనేయులు, ఉప్పేరు సుభాన్ ,బహుజన రాజ్య సమితి వాల్మీకి, వినోద్ కుమార్,కోళ్ల హుస్సేన్, కుర్వ పల్లయ్య, సుభాన్,అవాజ్ కమిటీ అతికూర్ రెహ్మాన్,శంకర ప్రభాకర్, మధుసూదన్ బాబు,దానయ్య, టీపీఫ్ నాగన్న,రైమతుల్లా, మీడిదొడ్డీ నర్సింహులు,ఉత్తనూర్ వెంకన్న,దామోదర్,కృష్ణ,ఉరుకుంద, వీరన్న, కృష్ణయ్య, సాధత్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి గ్రామంలో వినాయక చవితి వేడుకల్లో సందడి

## ఆకట్టుకున్న గోకుల కృష్ణ కోలాటంలో పాల్గొన్న సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి



**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 16( ప్రభాత ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పెద్దపల్లి గ్రామంలో వినాయక చవితి సందర్భంగా నిర్వహించిన గోకుల కృష్ణ జంట కోలాటం ఘనంగా జరిగింది.ధరూర్ గ్రామ చిన్నారులచే ప్రదర్శించబడిన కోలాటం భక్తి శ్రద్ధలతో సాగి గ్రామస్తులను ఎంతగానో ఆకట్టుకుంది. అద్భుతంగా ప్రదర్శించిన చిన్నారులను, కోలాటం మాస్టర్ దేవ బండ పరమేష్ ని గ్రామ సర్పంచ్ బిఅల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డిఅభినందించారు.ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు మరెన్నో జరుపుకోవాలని,గ్రామస్తులు ఐకమత్యం గా ఉండి గ్రామం లో ఇలాంటి కార్యక్రమంలు ఇంకా జరుపుకోవాలని సర్పంచ్ గ కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి తో పాటు ఉప సర్పంచ్ లక్ష్మీ నరసింహులు, వార్డు మెంబర్లు సవారి వెంకటేష్, పరశురాముడు, గుడిసె కిష్టన్న, సుజాతమ్మ, గ్రామ పెద్దలు శివన్న, ఉలవ నర్సింలు, ఎస్.టి.డి శీను, సత్యన్న, నరేందర్, రమేష్, శ్రీశైలం,కురువనర్సింహులు, గ్రామ యూత్ తదితరులు పాల్గొన్నారు.

# అపశృతులకు తావు లేకుండా నిమజ్జనాన్ని పకడ్బందీగా చేపట్టాలి

## వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 16 (ప్రభాత ఉదయం)**

జిల్లాలో వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో ఎలాంటి అపశృతులు చోటు చేసుకోకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి కృష్ణా నది పుష్కర ఘాట్ల వద్ద వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్న ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్, ఎస్పీ సందర్శించి నిమజ్జన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమజ్జన ప్రాంతానికి పెద్ద విగ్రహాలు, వాహనాలు సులభంగా చేరుకునేలా రహదారి చదును చేయడం, అవసరమైన చోట్ల మట్టి, మొరం, రాళ్లను ఉపయోగించి రహదారిని బాగు చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన రహదారిలో ఉన్న చెట్ల కొమ్మలు వాహనాల రాకపోకలకు అడ్డంకిగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పెద్ద విగ్రహాలను తరలించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. నిమజ్జన ప్రాంతంలో రాత్రి వేళల్లో భక్తులు, నిర్వాహకులు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. భక్తుల రాకపోకలు, భారీ వాహనాల రాకపోకలకు ప్రత్యేక మార్గాలు ఏర్పాట్లు చేయాలన్నారు. చిన్న విగ్రహాలతో వచ్చే భక్తులు ఒక నిర్దిష్ట మార్గంలో వెళ్లేలా, పెద్ద విగ్రహాల భారీ



వాహనాలకు ప్రత్యేక మార్గం ఉండేలా బారికేడింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. నిమజ్జన ప్రాంతంలోకి అనవసరంగా వాహనాలు ప్రవేశించకుండా నియంత్రణ చర్యలు చేపట్టి, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసు అధికారులకు సూచించారు. నిమజ్జన ఏర్పాట్లలో జెసిబిలు, క్రేన్లు,రోలర్లు, ఇతర అవసరమైన వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. వాహనాల వినియోగానికి సంబంధించి డ్యూటీ వివరాలు,సంబంధిత సిబ్బంది సంతకాలు, రోజువారీ రికార్డులను తప్పనిసరిగా నిర్వహించాలని తెలిపారు. ప్రథమ చికిత్స కేంద్రాలు, వైద్య సిబ్బంది , అత్యవసర సేవలను అందుబాటులో ఉంచాలన్నారు.మత్స్యకారులు, గజ ఈతగాళ్ల సేవలను వినియోగించుకోవాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిమజ్జన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.ఈ పర్యటనలో ఆర్డీవో శ్రీనివాసరావు, డిఎస్పీ మొగిలయ్య, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బొల్లారం విద్యుత్ శాఖ ఎఈగా రవీందర్

**పటాన్ చెరు, సెప్టెంబర్ 17 (ప్రభాత ఉదయం):**

బొల్లారం డివిజన్ విద్యుత్ శాఖ ఎఈగా కె.రవీందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్బంగా ఆయన బొల్లారం డివిజన్ విద్యుత్ శాఖ కార్యాలయం ఉద్యోగ భాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో విద్యుత్ సమస్యలు పరిస్కరిస్తానని అన్నారు. కార్యాలయ ఉద్యోగులు సిబ్బంది ఆయనకు ఘనస్వాగతం పలికారు.





## ముస్కీపేట వినాయకుడిని దర్శించుకున్న కర్క నాగరాజు

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 16 (ప్రభాత)**

కూకట్‌పల్లి నియోజకవర్గం, కైత్లాపూర్ డివిజన్‌లోని ముస్కీపేటలో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని కూకట్‌పల్లి నియోజకవర్గం ఐఎన్టియుసి అధ్యక్షుడు కర్క నాగరాజు సందర్శించారు. ఈ సందర్భంగా వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఉత్సవ కమిటీ నిర్వాహకులు మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో కర్క నాగరాజును ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అర్జున్, ఎల్లేష్, మల్లేష్, లీడర్ బాబు, కర్క లోహిత్ రాజ్, కార్తీక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.



## మూసాపేట్‌లో ఘనంగా వినాయక చవితి వేడుకలు

**వినాయకుడి పూజల్లో పాల్గొని**
**అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన బండి రమేష్**

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 16 (ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గం, మూసాపేట్ డివిజన్‌లో తూము రజినీకాంత్ ఆధ్వర్యంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వినాయకుడి ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, వినాయక చవితి పండుగ ప్రజలందరిలో భక్తి, ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, విజయాలు కలగాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పుష్పారెడ్డి, తూము సంతోష్, ఎల్లారావు, సతీష్ గౌడ్, కర్రెమ్మ, ఇజాజ్, వాసు తదితరులు పాల్గొన్నారు.



## బీసీ గురుకుల ఎంజేపీ గురుకులంలో గణనాథుడికి పూజలు

**విగ్రహధాతను సన్మానించిన ప్రిన్సిపాల్ బోళ్ల స్రవంతి**

**పటాన్ చెరు, సెప్టెంబర్ 16(ప్రభాత ఉదయం)**

పటాన్ చెరు మండలంలోని చిన్న కంజర్ల గ్రామంలో గల మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రిన్సిపాల్ బోళ్ల స్రవంతి, అధ్యాపకులు ఉపాధ్యాయులు, ఆధ్వర్యంలో గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ స్రవంతి, విగ్రహదాత అయిన ఇంద్రేశం మున్సిపాలిటీ, చిన్న కంజర్ల 1వ వార్డు కౌన్సిలర్, మల్లేపల్లి శ్రీనివాస్ ను అధ్యాపకులు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో వారిని సన్మానించడం జరిగింది. ప్రిన్సిపల్ స్రవంతి మాట్లాడుతూ.. విగ్నేశ్వరుని ఆశీస్సులు విద్యార్థుల పైన ఉండాలని అందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో విద్యార్థులు పరీక్షలలో మంచి ఫలితాలు సాధించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏటీపీ రేఖ లక్ష్మి, అనిల్ కుమార్, డిప్యూటీ వార్డెన్, రాజస్వామి, ఉపాధ్యాయులకు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## తెలంగాణ విమోచన చరిత్రను పాఠ్యపుస్తకాలు చేర్చాలి

**సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలి**

**వడ్డేపల్లి రాజేశ్వర్ రావు, కంచి మహేందర్**

కూకట్ పల్లి, సెప్టెంబర్ 16 (ప్రభాత ఉదయం) సెప్టెంబర్ 17ను అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని కోరుతూ బీజేపీ తెలంగాణ విమోచన కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ , మండల రెవెన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు, కంచి మహేందర్ పాల్గొని, తెలంగాణ విమోచన చరిత్రను భావితరాలకు అందించేందుకు బీజేపీ ప్రతిపాదించిన "తెలంగాణ సప్త సంకల్పాలు" అమలు చేయాలని కోరారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించడంతో పాటు, సర్దార్ వల్లభభాయ్ పటేల్ స్మారక చిహ్నం,హైదరాబాద్--తెలంగాణ విమోచన మ్యూజియం, జిల్లా స్థాయిలో స్మృతి కేంద్రాలు, పాఠ్యపుస్తకాల్లో విమోచన చరిత్ర, చారిత్రక ప్రాంతాల్లో స్మారక స్థూపాలు, తెలంగాణ విమోచన పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. విమోచన పోరాటంలో అమరవీరుల త్యాగాలను గౌరవిస్తూ, తెలంగాణ విమోచన చరిత్రను శాశ్వతంగా పరిరక్షించాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఫతేనగర్, బాలానగర్, మూసాపేట, అల్లాపూర్ ప్రాంతాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## అధిదేవునిఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

**ఎల్లమ్మ బండలోని పలు వినాయక మండపాలను దర్శించుకున్న**
**కాంగ్రెస్ నాయకులు జిల్లా గణేష్**

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 16 (ప్రభాత ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని వినాయక మండపం లో గల విఘ్నేశ్వరుడిని కాంగ్రెస్ నాయకులు జిల్లా గణేష్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా గణేష్ నేత మాట్లాడుతూ ఎల్లమ్మబండ వినాయక భక్త బృందం ఏర్పాటు చేసిన వినాయకుని దర్శించుకోవడం జరిగిందని, అలాగే ఆల్విన్ డివిజన్ పరిధిలోని అనేక వినాయక మండపాలను అంగరంగ వైభవంగా ముస్తాబు చేసి వినాయక విగ్రహాలను భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడం జరుగుతుందని, ఆ ఆదిదేవుడు వినాయకుని దివ్యమైన ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వారు కోరుకున్న కోరిన కోరికలు నెరవేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వినాయక మండప సభ్యులు, కాలనీవాసులు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## పాపిరెడ్డి నగర్ కమిటీ హాల్ నిర్మాణానికి సహకరించాలి

**పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీకి వినతి పత్రాన్ని**
**అందించిన బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి**

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 16 (ప్రభాత ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గం, కూకట్ పల్లి జోన్ ఆల్విన్ కాలనీ సర్కిల్ వెంకటేశ్వర నగర్ డివిజన్ లోని పాపిరెడ్డి నగర్ లోగల శ్రీశ్రీశ్రీ వీరంజనేయ శివాలయం ఆవరణలో కమిటీ హాల్ నిర్మాణానికి సహకరించాలంటూ బుధవారం బస్తి కమిటీ, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే అరేకెపుడి గాంధీని కలిసి వినతి పత్రాన్ని అందిస్తూ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బస్తి అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి, కోశాధికారి నర్సింహులు ముదిరాజ్, ఆలయ కమిటీ చైర్మన్ పేర్ని ధర్మారావు, కె.వి.రాజు అధ్యక్షుడు ఆడెపు ప్రభాకర్ నేతలు ఆనంతరాములు, జీవి కన్నారావు. తిరుపతి రెడ్డి. పి శంకర్ రెడ్డి డి రామ్ రెడ్డి వనం ఆంజనేయులు, ఏ చంద్రశేఖర్ రెడ్డి. చంద్రయ్య ముత్యం వెంకట్ రెడ్డి , పి.శంకర్ రెడ్డి, కనకా రెడ్డి. పండు గౌడ్, శ్రీనివాస్ , సత్యనారాయణ రెడ్డి శ్రీకాంత్ భాస్కర్ గుప్తా శ్రీలత, లక్ష్మీ సులోచన.తదితరులు పాల్గొన్నారు.



## "అవ్వ ఏక్తీ ఎలిజి" అనువాద పుస్తక ఆవిష్కరణ

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 16 (ప్రభాత ఉదయం):**

కరీంనగర్ పట్టణానికి చెందిన ప్రముఖ కవి సబ్బని లక్ష్మీనారాయణ రచించిన "అవ్వ ( స్మృతి కవిత)" బెంగాలీ భాషలోకి "అవ్వ ఏక్తీ ఎలిజి" పేరున అనువాదము అయ్యింది. సబ్బని తన తల్లిపై తెలుగులో వ్రాసిన అవ్వ స్మృతి కవిత, ఇప్పటి వరకు ఇంగ్లీష్, ఫ్రెంచ్, జపనీస్ భాషల్లోకి అనువాదం అయ్యింది. ఇప్పుడు దీనిని ప్రముఖ బెంగాలీ కవయిత్రి కాబేరి చటోపాధ్యాయ బెంగాలీ భాషలోకి అనువదించారు. ఈ రోజు బుధవారం ఉదయం 10 గంటలకు కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు మరియు కేంద్ర ప్రభుత్వ హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ వారి నివాసంలో ఈ అనువాద పుస్తకాన్ని ఆవిష్కరించారు. సుమారు యాభయి పుస్తకాలు వ్రాసిన సబ్బనిని మరియు సబ్బని అవ్వ పుస్తకం ఐదు భాషల్లోకి అనువాదం కావడం పట్ల సంజయ్ కుమార్ గారు సబ్బని కృషిని అభినందించారు. పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, చొప్పదండి మాజీ శాసన సభ్యులు బొడిగె శోభారాణి, ఇంజనీర్ కోలా అన్నారెడ్డి, శ్రీ అరబిందో సొసైటీ కరీంనగర్ కార్యదర్శి ఉప్పల రామేశం, ఎలగందుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




## పర్యావరణ అవగాహన కార్యక్రమాలతో ప్రపంచ ఓజోన్ దినోత్సవ వేడుకలు

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 16 (ప్రభాత ఉదయం):**

కరీంనగర్ లయన్స్ క్లబ్ మరియు చొప్పదండి లయన్స్ క్లబ్‌లి వారి సంయుక్త 'ట్విన్నింగ్ యాక్టివిటీ' (జంట క్లబ్ కార్యక్రమం)లో భాగంగా, చొప్పదండిలోని ఇప్పనపల్లి హరికిషన్ జడ్పీ ఉన్నత పాఠశాల (బాలుర)లో ప్రపంచ ఓజోన్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పర్యావరణ అవగాహన మరియు సేవా కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాయడం శివకాంత్ పటేల్ (అధ్యక్షులు, కరీంనగర్ లయన్స్ క్లబ్), కోల అన్నారెడ్డి, బట్టు వినోద్ పటేల్, మెతుకు కె. చైతన్య, ఐత సూరజ్ కుమార్, మోరా బద్రేశం, వల్లాల కృష్ణ హరి, కొల్లూరి ఆనందం, లంబు సుధాకర్ రెడ్డి, వల్లాల జగన్, దూస రాము, సిరిపురం రాజు మరియు ఇప్పనపల్లి సాంబయ్య (మాజీ జెడ్పీటీసీ) పాల్గొన్నారు.విద్యార్థుల కోసం "ఓజోన్ పొరను రక్షించడం మన బాధ్యత"లి అనే అంశంపై వ్యాసరచన పోటీలి నిర్వహించారు. విజేతలకు ట్రోఫీలు మరియు ప్రశంసాపత్రాలను అందజేసి, పర్యావరణ పరిరక్షణపై మరింత అవగాహన కల్పించేలా వారిని ప్రోత్సహించారు.వేడుకల్లో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలి చేపట్టారు. విద్యార్థులు మరియు స్వచ్ఛంద కార్యకర్తలు ఉత్సాహంగా మొక్కలు నాటడంలో పాల్గొన్నారు; అలాగే ఆ మొక్కలను సంరక్షించి, వాటిని కాపాడాలని వారికి సూచించారు.ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే ఉద్దేశంతో, "ప్లాస్టిక్ సంచులను తగ్గించడం మన బాధ్యత" అనే సందేశంతో విద్యార్థులకు మరియు పాఠశాల సిబ్బందికి వస్త్రపు సంచులను పంపిణీ చేశారు. సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బిస్కెట్లను కూడా పంపిణీ చేశారు.వ్యాసరచన పోటీ మరియు పర్యావరణ అవగాహన కార్యక్రమాల నిర్వహణలో సహకరించినందుకు గాను, ఇప్పనపల్లి హరికిషన్ జడ్పీ ఉన్నత పాఠశాల లిప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందాన్ని సన్మానించారు.ఓజోన్ పొరను రక్షించడం, ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం, పచ్చదనాన్ని పెంపొందించడం మరియు విద్యార్థులను బాధ్యతాయుతమైన పర్యావరణ పౌరులుగా తీర్చిదిద్దడం యొక్క ప్రాముఖ్యతను నిర్వాహకులు వివరించారు.పర్యావరణహిత పద్ధతులను పాటించాలని, స్వచ్ఛమైన మరియు ఆరోగ్యకరమైన పర్యావరణం కోసం కలిసి కృషి చేయాలని విద్యార్థులకు మరియు ప్రజలకు పిలుపునివ్వడంతో కార్యక్రమం ముగిసింది.

## వైభవంగా వినాయక నిమజ్జనం

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 16 ( ప్రభాత ఉదయం)**



కేటిదొడ్డి మండలంలోని పలు గ్రామాల్లో వినాయకుడి నిమజ్జనం బుధవారం వైభవంగా నిర్వ హించారు. మూడు రోజులపాటు పూజలందుకున్న విగ్రహాలను నిమజ్జ నానికి తరలించారు. ముందుగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం వీధుల్లో మేళ తాళాలు, డప్పుశబ్దాల మధ్య వినాయ కుడిని ఊరేగించారు. విగ్రహాల ముందు చిన్నపిల్లలు, యువ కులు సంతో షాలతో డ్యాన్స చేశారు. ఎలాంటి అవాంఛ నీయ సంఘటనాలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608